ముథోల్ తహసీల్దార్‌గా శ్రీకాంత్

ముథోల్, జూలై, 25: ముథోల్ తహసీల్దార్‌గా శ్రీకాంత్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ విఠల్ నిజామాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. తహసీల్దార్ శ్రీకాంత్‌కు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఖానాపూర్ ఎంపీవోగా రత్నాకర్ రావు

ఖానాపూర్ రూరల్, జూలై 25 : ఖానాపూర్ మండల ఎంపీవోగా చిక్యాల రత్నకర్ రావు ఎంపీడీవో సునీత సమక్షంలో విధుల్లో చేరారు. పెంబి నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఖానాపూర్ ఎంపీవోగా చేసిన చంద్రశేఖర్ ఇబ్రహీంపట్నం మండలానికి బదిలీపై వెళ్లారు.

బాసర ఏఎస్ఐగా లక్ష్మారెడ్డి

బాసర, జూలై, 25 : బాసర పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా లక్ష్మారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ ఉద్యోగోన్నతి పొందడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు.

దిలావర్‌పూర్ ఎంపీవోగా గోవర్ధన్

దిలావర్‌పూర్, జూలై 25 : దిలావర్‌పూర్ ఎంపీవోగా గురువారం గోవర్ధన్ బాధ్యతలు స్వీకరించారు. కుభీర్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపీవో అజీజ్ ఖాన్ సారంగాపూర్ ఎంపీవోగా బదిలీపై వెళ్లారు. ఎంపీవో గోవర్ధన్‌కు పంచాయతీ కార్యదర్శులు కలిసి స్వాగతం పలికారు. అనంతరం ఎంపీడీవో అరుణరాణిని అజీజ్ ఖాన్ కలిశారు. నలుగురు పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలు స్వీకరించారు.

మామడ ఎంపీవోగా సాగర్‌రెడ్డి

నిర్మల్ అర్బన్, జూలై 25 : కుభీర్ ఎంపీవోగా పని చేసిన సాగర్ రెడ్డి మామడ ఎంపీవోగా బదిలీపై వచ్చారు. అనంతరం ఇక్కడ ఎంపీడీవో లేకపోవడంతో ఎంపీవో సాగర్ రెడ్డికి ఇన్‌చార్జి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సాగర్ రెడ్డిని కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉట్నూర్ ఎంపీడీవోగా రాంప్రసాద్

ఉట్నూర్, జూలై25 : ఉట్నూర్ ఎంపీడీవోగా గురువారం రాంప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శర్మ స్వాప్‌లో భాగంగా సిద్దిపేట జిల్లాకు వెళ్లారు. నిర్మల్ జిల్లా లక్ష్మణ చాందాలో పనిచేస్తున్న రాంప్రసాద్ స్వాప్‌లో భాగంగా ఉట్నూర్‌కు వచ్చారు. ఎంపీవో మహేశ్, బదిలీపై వెళ్లిన శర్మ, ఈజీఎస్ ఏపీవో రజినీకాంత్, ఈజీఎస్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ముథోల్ ఈవోగా ప్రసాద్ గౌడ్

ముథోల్, జూలై, 25 : ముథోల్ మేజర్ గ్రామపంచాయతీగా ఈవోగా ప్రసాద్ గౌడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ ఇన్‌చార్జి ఈవోగా పనిచేసిన అనూష జూనియర్ అసిస్టెంట్‌గా కొనసాగుతున్నది.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

దస్తురాబాద్, జూలై 25 : మండలంలోని మున్యాల గ్రామంలో నిర్మించిన ఇందూర్ పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు 3 రోజుల నుంచి వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం గ్రామస్తులు బోనాలతో తరలివచ్చారు. ఒగ్గు కళాకారుల నృత్యాలు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

అడెల్లి ఆలయంలో బోనాలు

సారంగాపూర్, జూలై 25 : మండలంలోని అడెల్లి పోచమ్మ ఆలయంలో గురువారం కొట్ల(బీ) గ్రామానికి చెందిన మహిళలు బోనాలు సమర్పించారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం కుటుంబ సభ్యులంతా సహపంక్తి భోజనాలు చేశారు.

దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్ చైన్‌గేట్, జూలై 25: లీగల్ గార్డియన్ షిప్ కార్యక్రమంలో భాగంగా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో లోకల్ లెవల్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిఏ.నాగమణి తెలిపారు. జిల్లాలోని దివ్యాంగులకు, బుద్ధి మాంద్యం గల వారి కోసం పనిచేసే స్వచ్ఛంద సంస్థలోని సభ్యులు వివిధ కేటగిరిలలో స్వచ్ఛందంగా పనిచేసే వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొదటి కేటగిరిలో (బుద్ధిమాంద్యం స్వచ్ఛంద సంస్థలోని ఒకరు సభ్యులు) పట్టాభద్రులై చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రెండవ కేటగిరిలో (దివ్యాంగుల నుంచి ఒకరు సభ్యులు) దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారు నేషనల్ ట్రస్ట్ ద్వారా ఏర్పడే లోకల్ లెవల్ కమిటీలో సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ నెల 31 లోపు సాయంత్రం 5 లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు జిల్లా సంక్షేమ శాఖాధికారి కార్యాలయం నిర్మల్ లో సంప్రదించాలని తెలిపారు.

Notice to show cause (General form)
IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE AT NIRMAL
I.A. NO. 58 OF 2024
IN
I.A. NO. 255 OF 2022
IN
APPEAL NO.17 OF 2021
Between: Kandli Laxmi Bai.
...Petitioner/Appellant
And
Bandolla Chinnanna and others
...Respondents/Defendants
And
Almas Ahmed
...Proposed respondent..
To
Almas Waheed W/o. Mohammed Abdul Sadique, Aged:38 Years, Occ: Agril, R/o.H.no.3-5-1/25, Bhainsa Town, Dist. Nirmal.
Whereas as the above Named petitioner/Appellant filed a petition for Under Order IX Rule 9, the above said I.A. No.58/2024 Posted for appearance of the Proposed respondents as above cited but the notices to the proposed respondent could not served hence the porposed respondent hereby wanted to appear in this court in person or by a pleader duly instructed on the 31-07-2024 at 10-30 A.M. to show cause of against the application failing which said application will be heard and determined ex-parte.
Sd/- **D.RAJASHEKHAR**, Advocate
Nirmal, Cell:738641 6668.

ఉప్పొంగిన గోదావరి, ప్రాణహిత

- ఎడతెరిపి లేని వాన
- నిండుకుండలా కడెం ప్రాజెక్టు
- స్వర్ణ ప్రాజెక్టు గేటు ఎత్తిన అధికారులు
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు

కడెం : కళకళలాడుతున్న కడెం ప్రాజెక్టు

జైనథ్ : ఉప్పొంగి ప్రవహిస్తున్న పెన్‌గంగ నది

కడెం, జూలై 25: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కడెం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 700 అడుగులు (7.603టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 692.350 అడుగులు (5.755టీఎంసీల) వద్ద ఉంది. గురువారం ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి 12112 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతున్నది. 692 అదనంగా వస్తున్న నీటిని రెండు వరదగేట్ల ద్వారా 13148 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. కుడి కాలువ ద్వారా 5 క్యూసెక్కులు, ప్రధాన కాలువ ద్వారా 403 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆయకట్టు పరిధిలో మొత్తం 68150 ఎకరాల సాగుకు నీటిని అందించనున్నారు.

వాహనాల రాకపోకలకు అంతరాయం

ఖానాపూర్, జూలై 25: ఖానాపూర్ పట్టణం నుంచి కడెం, లింగాపూర్, పెంబి, మంచిర్యాల వైపు గ్రామాలకు వెళ్లే ప్రజలు రెంకొనివాగు వద్ద తాత్కాలిక రోడ్లు కోతకు గురికావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

నిలిచిన రాకపోకలు

పెంబి, జూలై 25: మండలంలో గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు దొత్తి వాగు, పస్పుల వద్ద కడెం వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ వాగు అవతల ఉన్న మారుమూల గిరిజన గ్రామాలైన యాపల్‌గూడ, రాంనగర్, వస్పల్లి, దొందారి, పస్పులతో పాటు పలు గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర వైద్యం, నిత్యావసరాల కోసం ప్రాణాలకు అరచేతిలో పెట్టుకొని వాగు దాటాల్సి వస్తున్నది. అధికారులు స్పందించి ఇటీవల కూలిపోయిన పస్పుల వంతెన, దొత్తి వాగుపై వంతెనలను నిర్మించి సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉప్పొంగిన పెన్‌గంగ..

జైనథ్, జూలై 25 : మహారాష్ట్ర భారీ వర్షాల కారణంగా మండలంలోని వాగులు వంకలతో పాటు సరిహద్దున ఉన్న పెన్‌గంగ ఉప్పొంగి ప్రవహిస్తోంది. సాత్నాల ప్రాజెక్టు వరదతో జలకళను సంతరించుకున్నది. దీంతో పాటు అక్కడక్కడ పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో పత్తి, సోయా, కంది పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని మండల రైతులు వాపోతున్నారు. నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వ్యవసాయం పనులు నిలిచిపోయాయి.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి : ఎంపీడీవో రజ్వీర్

నేరడిగొండ, జూలై 25 : కడెం నదీ పరివాహక ప్రాంతంతో పాటు ఇతర వాగు సమీప ప్రాంత ప్రజలు వరదలతో అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రజ్వీర్ తెలిపారు. గురువారం మండలంలోని కడెం నదీ పరివాహక గ్రామాలైన గాజిలి, గాంధారి గ్రామాలను పరిశీలించారు. వరదలు ఉధృతంగా ఉండడంతో వాగులు, వంకలు దాటవద్దని సూచించారు. సీజనల్ వ్యాధులు నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మణ్, ఏపీవో వసంత్‌రావ్, సిబ్బంది పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

ఇంద్రవెల్లి, జూలై 25 : మండలంలోని చెరువులతో పాటు లోతట్టు ప్రాంతంలోని గ్రామాలు, వాగులు, వంకలు ఉన్న గ్రామాలను తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ సందర్శించారు. గురువారం మండలంలోని ముత్నూర్ త్రివేణి సంఘం ప్రాజెక్టును సందర్శించి, వరద ప్రవాహంపై ఆరా తీశారు. గౌరాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చిత్తబట్ట, దోడంద, ఘట్టేపల్లి గ్రామపంచాయతీలతోపాటు మండలంలో వాగులు ఉన్న జెండాగూడ, జైత్రం తండాల్లో పర్యటించారు. వాగులను పరిశీలించి స్థానిక ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు నాగోరావ్, అచ్చుత్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కుప్ప కూలిన ఇల్లు

నార్నూర్, జూలై 25 : ఎడతెరిపి లేని వానకు మండలంలోని నాగల్‌కొండ పంచాయతీ పరిధిలోని గోండుగూడకు చెందిన కుర్సింగ సీతారాం ఇల్లు గురువారం కుప్ప కూలింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని బాధితులు తెలిపారు. నిత్యావసర సరుకులతో పాటు సుమారు రూ.5లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

మట్టిరోడ్డుకు మరమ్మతు

నార్నూర్, జూలై 25 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్,తెలంగాణ ఆదర్శ పాఠశాలకు వెళ్లే మట్టి రోడ్డు బురదమయంగా మారింది. దీంతో పాఠశాలకు వెళ్లే ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. స్పందించిన ప్రత్యేకాధికారి జవహర్ గుంతలలో మట్టి వేయించారు.

జలమయం..

ఉట్నూర్ రూరల్, జూలై 25: మండలంలో నాలుగు ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు మత్తళ్లు దుంకుతున్నాయి. మండలంలోని గంగన్నపేట్, నేరెల్ల, మత్తడి, గోపాయి, ఎల్లమ్మ, పెద్ద చెరువు, నరసింహ చెరువు, నాగాపూర్ చెరువులకు వరద పెరిగింది. మరోపక్క శ్యాంపూర్, నాగాపూర్, దంతన్‌పెల్లి వాగులు నిండుగా ప్రవహిస్తున్నాయి. గంగన్నపేట్‌లో వరద నీరు, చెరువు మత్తడి ద్వారా వెళ్తున్న నీరు కలిసి నీటి ప్రవాహంతో వరి పొలాలు నీట మునిగాయి. వ్యవసాయ పనులు నిలిచిపోయాయి.

త్రివేణి సంగమం ప్రాజెక్టుకు జలకళ..

ఇంద్రవెల్లి, జూలై 25 : మండలంలోని గ్రామాల్లో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మండలంలోని జైత్రంతండా, జెండాగూడ, చిత్తబట్ట, మామిడిగూడ వాగులు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముత్నూర్ త్రివేణి సంగమం ప్రాజెక్టుతోపాటు ఏమాయికుంట చెరువులో భారీగా వరద నీరు చేరింది. మత్తడిపై నుంచి వరద నీరు దుంకుతున్నది. దీంతో వాగుల అవతలి భాగంలో ఉన్న గ్రామాల ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.

నేల కొరిగిన విద్యుత్ స్తంభాలు

మండలంలో వారం నుంచి కురుస్తున్న ముసురు వర్షంతో బురదమయంగా మారడంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గురువారం మండలంలోని సాయినగర్, పూలాజీబాబానగర్‌లో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలతోపాటు చెట్లను విద్యుత్ అధికారులు తొలగించారు. వర్షంలోనే మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు దుర్గారాజ్, మానిక్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

భీంపూర్ మండలంలో..

భీంపూర్, జూలై 25 : ఎడతెరిపి లేని వర్షాలతో కరంజి, ధనోరా వాగులు, పెన్‌గంగ జలకళ సంతరించుకున్నాయి. కాగా ఆదిలాబాద్ – కరంజి(టీ) ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

పెంబి : ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటుతున్న ప్రజలు

ఖానాపూర్ : రెంకోనివాగు వద్ద కోతకు గురైన తాత్కాలిక రోడ్డు

ఇంద్రవెల్లి : ముత్నూర్ త్రివేణి సంగమం ప్రాజెక్టును పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

నార్నూర్ : నాగల్‌కొండ గోండుగూడలో వర్షానికి కుప్ప కూలిన ఇల్లు

ఇంద్రవెల్లి : విద్యుత్ తీగలపై విరిగి పడిన చెట్లు

ఉట్నూర్ రూరల్ : పెర్కగూడ సమీపంలో దెబ్బ తిన్న పత్తి పంట

పోగొట్టుకున్న 41 సెల్ ఫోన్‌ల అందజేత

నిర్మల్ అర్బన్, జూలై 25 : నిర్మల్ జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా కనుక్కొని స్వాధీనం చేసుకున్న 41 సెల్‌ఫోన్లను గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జానకీ షర్మిల అందజేశారు. ఇప్పటి వరకు 809 సెల్‌ఫోన్లను బాధితులకు అందించామని తెలిపారు. ఐటీ కోర్ విభాగం సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ గంగారెడ్డి, ఆర్ఎస్ఐ రవి, ఐటీ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆచార్య నాగార్జున మహాథేరో జయంతి

భైంసా, జూలై, 25: బౌద్ధ గురువులు ఆచార్య నాగార్జున మహాథేరో జయంతిని గురువారం పట్టణంలోని రాహుల్‌నగర్, బుద్ధ విహార్‌లో ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఐ బౌద్ధాచార్యులు ప్రసంజీత్ హేమ్లే, గణేశ్ హెమ్లే, రాహుల్ తదితరులు ఉన్నారు.

బుద్ధుడి బోధనలు అనుసరించాలి

ఇంద్రవెల్లి, జూలై 25 : సమస్త మానవాళికి బుద్ధుడి బోధనలు అనుసరణీయమని పూజ్య భంతేజీ బధంత్ ప్రజ్ఞశీల్ అన్నారు. ఆషాఢ మాసం పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం మండలంలోని బుద్ధనగర్, మిలింద్‌నగర్‌లోని బుద్ధవిహార్‌లో బుద్ధుడు, ధమ్మ గ్రంథ పఠన చేశారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ ఉపాసకులు, ఉపాసకిలు తదితరులు పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో ఎస్సీ గురుకులాల్లో స్పాట్ కౌన్సెలింగ్

ఎదులాపురం /బోథ్, జూలై 25 : రాష్ట్రంలోని ఎస్సీ గురుకులంలో జూనియర్, ఒకేషనల్ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈనెల 26, 27వ తేదీల్లో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఎస్సీ గురుకులం డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ లలిత కుమారి , బోథ్ గురుకుల వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు. సంబంధిత రీజియన్ పరిధిలోని బాలికలకు 26న లక్షెట్టిపేటలో, 27న బాలురకు బెల్లంపెల్లి సీవోఈలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఇచ్చోడ(సిరికొండ), జూలై 25 :సైబర్ నేరాలపై గురువారం సిరికొండ మండలంలోని రిమ్మ, రాజన్న పేట్ గ్రామాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై కాత్లే రమేశ్ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు పంపించిన సెల్‌ఫోన్లకు వచ్చే లింకులను తెరవొద్దన్నారు. ఎవరికీ ఎలాంటి ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ అర్జున్, సిబ్బంది, గ్రామస్తుల పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏ లో కలపాలి

కుభీర్, జూలై 25 : ముదిరాజ్ కులస్తులను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని కోరుతూ కుభీర్‌లోని తహసీల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు గురువారం కులస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు సూది రాజన్న, సట్ల గంగాధర్, జైరాం, సట్ల బుచ్చన్న, సూది అడెల్లు, సట్ల శ్రీధర్, సూది పీరాజీతో, కుల సంఘం నాయకులున్నారు.

ఆరు గ్యారెంటీల ఊసెత్తని కాంగ్రెస్ : బీజేపీ

సారంగాపూర్, జూలై 25 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే మాట తప్పిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్ అన్నారు. బుధవారం మండలంలోని కరుణాకర్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్ర బడ్జెట్‌తో తెలంగాణకు నష్టం జరిగిందని ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కదోవ పట్టేప్రయత్నం చేస్తుందని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రతి పథకం తెలంగాణ ప్రజలకు దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు కరిపె విలాస్, బీజేపీ నాయకులు వడ్డెరాజేందర్‌రెడ్డి, రాంశంకర్‌రెడ్డి, గంగారెడ్డి, చెన్న రాజేశ్వర్, బడి పోతన్న, సాహెబ్‌రావు, వీరయ్య, సాదురాంరెడ్డి, వెంకటేశ్, తిరుమలచారి, వినోద్, చాణక్య, రాజేశ్వర్‌రెడ్డి , కార్యకర్తలు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో తెలంగాణపై కేంద్రం వివక్ష : బీఎస్పీ

జైనథ్, జూలై 25 : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష చూపిస్తున్నదని బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి దేవిదాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంజాబ్ రాష్ట్రానికి నిధులు కేటాయించకపోతే ఆందోళన చేస్తున్నారని, తెలంగాణలో ఇద్దరు కేంద్ర, మంత్రులు 8 మంది ఎంపీలు ఉన్నప్పటికీ ఎందుకు ప్రశ్నించడం లేదని విమర్శించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఎదులాపురం, జూలై 25 : చట్టాలపై అవగాహన ఉండాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి బోనగిరి సౌజన్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల నంబర్ 2లో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా హాజరై చట్టాలు, న్యాయ సేవలపై వివరించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ ప్రధాన న్యాయవాది దాసరి గంగారం, సహాయ న్యాయవాది ఉమేశ్ రావుడోలే, డిప్యూటీ సహాయ న్యాయవాది ఏ.అశోక్, ప్రిన్సిపాల్ సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

మహిళా శక్తి యూనిట్ల ఏర్పాటుపై సమావేశం

ఎదులాపురం, జూలై 25: మహిళా శక్తి యూనిట్ల స్థాపనకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో మహిళా సమాఖ్య సంఘాలతో సమావేశం నిర్వహించారు. యూనిట్ల కింద క్యాంటీన్, క్యాటరింగ్, కోల్డ్‌స్టోరేజీ లాంటి వాటిని స్థాపించేలా బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలను అందిస్తుందన్నారు. ఈ సమావేశంలో శ్రీనిధి మేనేజర్ ఆర్ఎం పూర్ణచందర్, డీఎంసీ శ్రీనివాస్, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా విజయ్ దివస్

అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

నిర్మల్ అర్బన్, జూలై 25 : నిర్మల్ పట్టణంలోని బాష్యం ఉన్నత పాఠశాలలో గురువారం కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని పాఠశాలలో అమర వీరుల త్యాగాలను స్మరిస్తూ వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. అమరుల త్యాగాలను స్మరిస్తూ దేశానికి వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రెసిడెంట్ సుదాకర్ రెడ్డి, డైరెక్టర్ ప్రియా కపిల్, కరస్పాండెంట్ కౌశిక్, ప్రిన్సిపాల్ ప్రశాంత్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాట్యమయూరి అవార్డు

అవార్డు అందుకున్న చిన్నారులు

నిర్మల్ అర్బన్, జూలై 25 : నిర్మల్ జిల్లాకు చెందిన నృత్యమాల నాట్య అకాడమికి చెందిన పలువురు చిన్నారులు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన తెలంగాణ బోనాల సంబురాలు కూచిపూడి నృత్య పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో సుహాసిని, నైనిక, సుహాని, సాన్వి, గ్రీష్మ, త్రిష, తన్మయి, వృషిక, నోమిత, ప్రిశా, రవిత్రిని పాల్గొని అత్యుత్తమ నృత్య ప్రదర్శనను చేపట్టి నాట్య మయూరి అవార్డును అందుకున్నారు. ప్రతిభ కనబర్చిన చిన్నారులను నృత్యమాల నాట్య అకాడమీ శిక్షకురాలు ఏలేటి అంజలిరెడ్డి అభినందించారు. ఇప్పటికే చిన్నారులు గిన్నిస్ రికార్డుతో పాటు అనేక అవార్డులను అందుకున్నారని తెలిపారు.

డబుల్ బెడ్రూంల వద్ద నిరసన

నిరసన తెలుపుతున్న డబుల్ బెడ్రూం లబ్ధిదారులు

భైంసా, జూలై, 25 : పట్టణంలోని డబుల్ బెడ్రూం లబ్ధిదారులు గురువారం నిరసన చేపట్టారు. డబుల్ బెడ్రూం లబ్ధిదారులకు తాగునీరు, విద్యుత్, రోడ్డు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు.

ఇంటిపై విద్యుత్ తీగలు తొలగించండి..

బోథ్, జూలై 25 : మండలంలోని కౌఠ(బీ) లో బిక్క గోపి ఇంటికి ఆనుకొని ఉన్న విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. ప్రాణ నష్టం జరగక ముందే అధికారులు స్పందించి విద్యుత్ తీగలను తొలగించాలని బాధితుడు కోరాడు.



ఇంటిపై ప్రమాదకరంగా తీగలు

ఎలక్ట్రిక్ ట్రై సైకిల్ అందజేత

సోన్, జూలై 25 : పేద కుటుంబానికి చెందిన సోన్ మండల కేంద్రానికి చెందిన దండుగుల పోశెట్టి ఇటీవల రోడ్డు ప్రమాదంలో కుడి కాలు కోల్పోయాడు. అతని పరిస్థితిని చూసి గ్రామ యువకులు, ఎన్ఆర్ఐలు విరాళాలు సేకరించి ఎలక్ట్రిక్ సైకిల్‌ను బుధవారం అందజేశారు. దాతలకు పోశెట్టి కృతజ్ఞతలు తెలిపాడు. ఈ కార్యక్రమంలో అష్టం మధు, నీలం రాజు, దేవుడల మహేశ్, అరుగుల రణధీర్, పట్టేపు హరీశ్, కొంతం భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నలుగురి రిమాండ్

మాట్లాడుతున్న డీఎస్పీ నగేందర్ గౌడ్

ఉట్నూర్, జూలై 25 : గంజాయిని అమ్మేందుకు ప్రయత్నిస్తున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఉట్నూర్ డీఎస్పీ నగేందర్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. రెండు రోజుల క్రితం మండలంలోని ఎక్స్‌రోడ్, లింగోజీతండా సమీపంలో చేతిలో సంచితో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా సుమారు రూ.లక్ష విలువైన 4.082 కిలోల గంజాయి దొరికిందన్నారు. అతడిని విచారించగా ఉట్నూర్‌కు చెందిన బాలాజీ, ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన వంశీసాయి, గణేశ్ గంజాయితో రాగా ఇంద్రవెల్లికి చెందిన గోవింద్ వారిని రిసీవ్ చేసుకొని మండలంలోని శ్యాంపూర్‌కు వెళ్తుండగా ముందస్తు సమాచారంతో వారిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదుచేయడంతో పాటు కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. గంజాయి అమ్మినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉట్నూర్ సీఐ మురళీ, ఎస్ఐలు మనోహర్, సునీల్, సిబ్బంది ఉన్నారు.

దోపిడీకి పాల్పడుతున్న ఆరుగురి అరెస్ట్

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నిర్మల్ అర్బన్, జూలై 25 : ఒంటరిగా ఉన్న వ్యక్తులను టార్గెట్ చేసి వారిని ఆకర్షించి నగదు, ఆభరణాలను దోచుకుంటున్న ముఠా సభ్యులను గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ గంగారెడ్డి వివరాలను వెల్లడించారు. మామడ మండలం తాండ్ర గ్రామానికి చెందిన రాథోడ్ గణేశ్ బంధువులు దవాఖానలో ఉండడంతో వైద్య ఖర్చులకోసం రూ.45వేలను తీసుకుని నిర్మల్‌కు వచ్చాడు. ఈ క్రమంలో పాతబస్టాండ్ ఏరియాలో ఓ కల్లుబట్టిలో కల్లు తాగేందుకు వెళ్లాడు. అక్కడే నలుగురు మహిళలు, ఇద్దరు పురుషులు అక్కడ ఉన్నారు. మద్యం తాగిన తర్వాత అతన్ని కొట్టి భయబ్రాంతులకు గురి చేసి ఆటోలో శ్యాంగఢ్ ఏరియాకు తీసుకెళ్లి అతని వద్ద ఉన్న రూ.45 వేల నగదు, సెల్‌ఫోన్‌ను లాక్కుని పారిపోయారు. మోసపోయాను అని గ్రహించిన రాథోడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం నిర్మల్ రూరల్ మండలం న్యూపోచంపాడ్ గ్రామానికి చెందిన బోసు రుక్మ, రాపని రుక్మ, బోసు శాంత, బోసు సాయన్నతో పాటు నిర్మల్ పట్టణం బుధవార్‌పేట్ కాలనీకి చెందిన కర్రోల్ల సాగర్, శిర్షు సాయన్నను అరెస్ట్ చేశారు. రూ.30వేల నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తదితరులున్నారు.

పాఠశాలలో మొక్కలు నాటిన విద్యార్థులు

ఎదులాపురం, జూలై 25: వనమహోత్సవం భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మీవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు మున్సిపల్ సిబ్బంది కలిసి మొక్కలు నాటారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పిల్లి కిషన్, మున్సిపల్ పర్యావరణ ఇంజనీర్ అవి కిరణ్, ఉపాధ్యాయులు నరేందర్, రవీందర్, సతీశ్, రాజు, చంద్రశేఖర్ రజిత మౌనిక హరిచరణ్ గణపతి తదితరులు పాల్గొన్నారు .

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లు

-బస్సుల్లో మర్చిపోయిన నగదు, సెల్‌ఫోన్ అందజేత

నిర్మల్ అర్బన్, జూలై 25 : ఆర్టీసీ బస్సుల్లో మర్చిపోయిన రూ.2లక్షల నగదు, రూ.25 వేల విలువైన సెల్‌ఫోన్‌ను బాధితులకు అందజేసి కండక్టర్, డ్రైవర్ తమ నిజాయితీని చాటుకున్నారు. నిజామాబాద్ నుంచి నిర్మల్‌కు వస్తున్న బస్సులో సురేశ్ బ్యాగును మర్చిపోయాడు. బస్టాండ్‌కు వచ్చిన తర్వాత ప్రయాణికులు అందరూ దిగిపోగా డ్రైవర్ తాజొద్దీన్, కండక్టర్ రాజు బ్యాగును గమనించారు. తెరిచి చూడగా రూ.2 లక్షల నగదు ఉంది. బ్యాగులో ఉన్న వివరాల ఆధారంగా ప్రయాణికుడికి సమాచారం అందించారు. నగదును సురేశ్‌కు ఆర్టీసీ అధికారులు అందజేశారు. ఇదే విధంగా బస్సులో రూ.25 వేల విలువ చేసే ఫోన్‌ను మర్చిపోయిన ప్రయాణికుడికి డ్రైవర్ అఫ్రోజ్ అందజేశారు. రెండు ఘటనలో నిజాయితీ చాటుకున్న వారిని డీఎం ప్రతిమా రెడ్డి, ఆర్టీసీ అధికారులు అభినందించారు.

భద్రాచలం ఐటీడీఏ ఏపీవో భీం మృతి

ఉట్నూర్, జూలై 25 : భద్రాచలం ఐటీడీఏ ఏపీవో పెందూర్ భీం అనారోగ్యంతో బాధపడుతూ గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. భీం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో ఏవోగా, ఏపీవోగా, డీడీగా పనిచేస్తూ గిరిజనులకు సేవలందించారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ కుటుంబాన్ని పరామర్శించారు. నిర్మల్ జిల్లా మల్లాపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భీంకు భార్య మంజుల, కొడుకు హరీశ్, కుమార్తె రమ్య ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి :డీఎంహెచ్‌వో

గుడిహత్నూర్, జూలై 25 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రసుతి గది, స్టోర్ రూం, రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య విషయాలపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు.

అంకోలి చెరువులో ఇమిగో పక్షుల సందడి..

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి చెరువులో ఇమిగో పక్షి

ఆదిలాబాద్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులు, ప్రాజెక్టులకు జల కళ సంతరించుకున్నది. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని దారిలొద్ది గ్రామంలో కింగ్ ఫిషర్ పక్షి, అంకోలి చెరువులో ఇమిగో పక్షులు గుంపులు గుంపులుగా దర్శనమిచ్చాయి. ఇవి ఆదిలాబాద్ జిల్లాలో అన్ని కాలాలు చెరువులు, వాగుల వద్ద గుంపులుగా ఉంటాయి. గులాబీ, తెలుపు, నలుపు రంగుల్లో ఉండి మూతి పొడవుగా పచ్చగా ఉంటుంది. ఇవి ఎక్కువగా అంకోలి చెరువు వద్ద కనిపిస్తాయి. కొంగ జాతిలో ఇవి ఓ రకం కొంగలు. గుంపులుగా పక్షులు రావడంతో ప్రజలు ఆశ్చర్యంగా చూస్తున్నారు. వాటి చిత్రాలను సెల్‌ఫోన్‌లలో బంధిస్తున్నారు.

చెరువు సమీపంలో ఇమిగో పక్షులు

- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, జూలై 25